# పాలాయణంలో ప్రేమాయణం

మా పాలబ్బి తీరే వేరు. అతని పోకడే వేరు. స్టయిలే వేరు. అతనికతనే సాటి. అతనితో సరిపోల్చదగిన వారు ఈ భూలోకంలో ఎందువెదికినా కన్పించరు గాక కన్పించరు.

పాలబ్బికి సరితూగే జోడి మా పనిమనిషి. పాలబ్బికి వర్తించే విశేషణాలన్నీ పనిమనిషికి వర్తించును గావున పునరుక్త దోష నివారణార్థం చెప్పడం లేదు.

ఔరా! ఏమి ఆ ఘనచరితంబు అని మీరు ఆత్రుతతో వేచిచూస్తున్నారు కనుక విషయంలోకి వెళ్దాం మరి.

మేం ఉండేది రెండుగదుల కొంప. అలాంటి రెండుగదుల పోర్షన్లు మా ఆవరణలో ఆరున్నాయి. అంటే ఒకే ఆవరణలో ఆరు సంసారాలు. వాళ్ళ పిల్లా జల్లా (భాగ్యనగరం కనుక గొడ్డూ గోదాకు ఆస్కారం లేదు) కాలక్షేపం చేస్తున్నారు. అయితే మా ఇంటావిడ మాత్రం ముద్దుగా కోళ్ళను పెంచుతోంది. అవి రాజసంగా మా వంటింట్లోకి ప్రవేశించి జంకూ గొంకూ లేకుండా అన్నంమెతుకులు కతికి వెళ్తుంటాయి.

ఈ ఆరు పోర్షన్లలో ఒకదాంట్లో మా ఇంటావిడ ఉంటుంది. పాలబ్బిగురించీ, పనిమనిషి గురించి మాట్లాడుతూ మధ్య ఇంటావిడ ప్రస్తావన ఏమిటి? అని మీకు అనిపించే వచ్చును. కానీ పక్కపోర్షను రమణి ఇంటావిడ ప్రస్తావనలేని పలుకు నిరర్థకం అని రూఢిచేస్తూ ఓ థీసిస్ రాసేసి పిహెచ్.డి కొట్టేయగల సత్తా వుంది. రమణికి ఆ ఛాన్స్ ఇవ్వడం ఇష్టం లేక నేనే ఆ ప్రస్తావన చేశాను.

''అక్కా! ఇది విన్నావా? ఇంటావిడ రాత్రి మూడింటికొచ్చింది. ఎక్కడ తిరిగొచ్చిందో ఎవరితో తిరిగొచ్చిందో ఏమో! రాత్రి వీధివాకిలి తలుపు తీద్దునుగదా. ఎదురుగా జుట్టువిరబోసుకుని అపరకాళిలా ఈవిడ. గుప్పుమని బ్రాందీవాసన వచ్చింది. ఇదేం చోద్యం అక్కా! నువ్వయినా చెప్పు. ఆవిడ ధాటికి తాళలేక ఆ మొగుడు కాస్తా ఎంత ...న్యాసుల్లో కలిసిపోతే మాత్రం ఈవిడ ఇంతగా ...తెగించడమా? పైగానేమో అందరికీ నీతులు చెప్తుంది'' అంది రమణి ఇంటావిడ మీద అక్కసంతా వెళ్ళగక్కుతూ.

''ఇంటావిడ ఎటుపోతే మనకేల బాలా?'' అన్నాను నేను.

''ఇంటావిడ పేరు వినగానే నాపేరు కూడా మర్చిపోతున్నారే. నేను రమణిని. బాలవిజయ పోర్షన్‌లో ఉంటుంది. నీకెంతయినా ఆ బాలంటేనే ఇష్టం'' అంది. తెలుగు సినిమా సెకండాఫ్‌లో హీరోయిన్ అభినయాన్ని అనుకరిస్తూ.

''తాగడం ఆవిడకు తప్పులేదు. నువ్వెందుకు తప్పుపట్టడం'' అన్నాను నేను.

''అవ్వ! ఈ మాటలంటున్నది నువ్వేనా?'' అని రమణి ముక్కున వేలేసుకుంది.

ఆవిడ ఇష్టం, తాగుతుంది. తైతక్కలాడుతుంది'' అని నేను రెట్టించాను.

రమణి చివాల్న లేచి తన ఇంట్లోకి వెళ్ళిపోయింది. పోతే పోయిందిలే. ఈ కోపం ఎంతసేపు అనుకుని నవ్వుకున్నాను.

ఆ ఇంట్లో అద్దెకు దిగిన కొత్తలో ఒక పాలబ్బినీ పరిచయం చేసింది రమణే.

''పాలకోసం దిగులెందుకూ! మన చిరంజీవి ఉన్నాడుగా'' అంది రమణి.

''చిక్కగా పోస్తాడా?'' అన్నాను.

''ఆ గ్యారెంటీ మాత్రం నేనివ్వలేను గానీ చిరంజీవి దగ్గర పాలు పోయించుకోకుంటే మీకిక పాలకే గతులుండవు'' అంది రమణి హెచ్చరికగా.

''అదేం! ఈ చిరంజీవి లేకుంటే ఇంక ఈ ప్రాళ్ళో పాలే పుట్టవా?'' అన్నాను

''పుడతాయి. అయితే ఈ ఇంట్లో మీరువున్నంత కాలం చిరంజీవి దగ్గరే పాలు పోయించుకోవాలి. వేరే పాలవాడు ఈ పరగణాల్లో కాలు పెడితే చిరంజీవిని ఫైటింగ్ సీన్‌లో చూడాల్సి వస్తుంది మరి''

''అంతటి మొనగాడా?''

''ఆ... నువ్వు ట్రై చేసి చూడు. ఏ పాలవాడయినా ఈ ఆవరణలో ప్రవేశించి మీకు పాలుపోసే ధైర్యం వుంటే అతగాడికి శౌర్యపతకాన్ని బహూకరిస్తాను''

''చాలా మతలబు ఉందే'' అన్నాను కళ్ళు పెద్దవి చేసి షాక్‌నుంచి తేరుకుంటూ.

''ఈ ఇంట్లో దిగేటప్పుడే ఇంటావిడ చెప్పి వుండాలే. పాలకీ, పనికీ ఆస్థాన విద్వాంసులున్నారని''

''ఆ చెప్పినట్టే వుంది. సకల సౌకర్యాలు మీ ముంగిట్లోనే అన్నట్లు గుర్తు'' అన్నాను ఇంటావిడతో మాట్లాడిన సన్నివేశాన్ని గుర్తు వేసుకుంటూ—



''మరింకేం. పాయింట్ క్లియరయిందా?''

''ఎందుకొచ్చిన గొడవకానీ— రేపు చిరంజీవి వస్తే మాకు కూడా పాలుపోయాలని చెప్పు''

''వేరే చెప్పనక్కర లేదు. చిరంజీవికి తెలుసుకదా. తనే పాలుపోయాల్సి ఉంటుందని. అంచేత నువ్వేం గాభరా పడక. ఈ పోర్షన్లలో మారేది మనుషులే. పాలవాడిక మాత్రం చిరంజీవిదే'' అన్నది రమణి.

పాలు ఎలా వుంటాయోగానీ పేరుమాత్రం బాగుంది అనుకున్నది ఆ 'చిరంజీవి' అనబడే పాలబ్బిని మనసులో ఊహించుకుంటూ.

ఆ మర్నాడు ఉదయం అయిదింటికి పిళ్ళ

పద్తుండగా- వాకిట్లో స్కూటర్ ఆగిన చప్పుడ యింది.

''విరంజీవి వచ్చాడు... విరంజీవి వచ్చాడు'' అంటూ ఎక్కడి అమ్మలక్కలు అక్కడినుంచి గెంతి ఇళ్ళలోకి వెళ్ళి గిన్నెలతో సిద్ధమై పోయారు.

''నువ్వూ గిన్నె తీసుకురా'' అంది రమణి హెచ్చరిస్తూ.




కాల్చుల ఉత్తర్వు విని చెల్లాచెదరైన ప్రజానీకం లా విరంజీవి స్కూటర్ మోత విని వీరంతా ఇలా దౌడు తీసి గిన్నెలతో అరక్షణంలో అటెన్షన్‌లోకి రావడమేమిటో నా బుర్రకి అంతుచిక్కలేదు.

''ఆ వచ్చిన పాలవాడు పోయకుండా వెళ్లడుగదా! అంత గాభరా దేనికి'' అన్నామ రమణితో.

''నీకింకా తెలీదులా వుంది. ఒక్కక్షణం గిన్నె తేవడం లేటయితే విరంజీవికి కోపం వస్తుంది. పాలుపోయకుండా వెళ్ళిపోతాడు'' అంది రమణి చూపుల్తో భయం గుమ్మరిస్తూ.

''ఇది మరీ బావుంది. అంతగా ఒణికిపోవడం దేనికి''

''దేనికేమిటి! పాలకోసం'' అంది రమణి సాదాసీదాగా.

రమణితో వాదన కట్టిపెట్టి నేనూ లోపలకి వెళ్ళి గిన్నె తెచ్చాను.

స్కూటర్ ఆపిన విరంజీవి పాలటిఫిన్ చేతబుచ్చుకుని ఠీవిగా ఆవరణలోకి అడుగు పెట్టాడు.

రమణికి పాలుపోస్తుంటే విరంజీవితో అన్నది.

''ఈ పోర్షన్‌లోకి కొత్తగా వచ్చారు. ఈరోజు మంచీ వీళ్ళకీ పాలు పొయ్యి విరంజీవీ'' అని.

విరంజీవి కళ్ళు పైకెత్తి నావంక చూశాడు.

''మిమ్మల్ని కరుణించితిని పో'' అన్నట్లు ఉందా చూపు.

''ఎన్ని పోయాల'' అన్నాడు విరంజీవి నన్ను ఉద్దేశించి.

''పొద్దున లీటరు సాయంత్రం అరలీటరు. రోజూ ఈ వేళకి వస్తుంటావా? లేటేం కాదుగదా'' అన్నాను.

నా మాటల్ని విన్పించుకోకుండా—

''ముందే సెప్తున్నా. ఎగస్ట్రా కావాలంటే వాకాడ దొరకవు''

అనేసి— గిన్నెలోని పాలుపోసి కదిలిపోయాడు విరంజీవి.

''పాలేం పెద్దచిక్కగా ఉన్నట్లు లేవే అన్నాను రమణితో పాలవంక చూస్తూ.

''అంతే. ఈ సిటీలో అంతకంటే చిక్కగా ఎవరు పోస్తారు. పాలు పలచగా ఉన్నాయేం అని విరంజీవిని మాత్రం అడక్కు''

''అదేమిటి— డబ్బులు ఇస్తున్నప్పుడు చిక్కగా పోయమని అడిగే హక్కు లేదా?''

''అక్కా! హక్కుల గురించి కట్టిపెట్టు. పూర్వం ఇలాగే ఒకావిడ విరంజీవిని పాలు చిక్కగా లేవేం అందిట. అంతే ఆ మర్నాటి మంచి విరంజీవి ఆవిడకి పాలు బంద్ చేశాడు. ససేమిరా పోయనన్నాడు. పిల్లాపాపలతో పాలు లేక నానా ఇబ్బంది పడ్డదనుకో''

''మరప్పుడేం చేశారు'' అన్నాను ఆసక్తిగా.

''నాలుగు రోజులు లోపాయికారిగా నేనే పోయించుకుని ఆవిడకు ఇచ్చాను. ఈ లోపల విరంజీవిని— ఏదో ఆవిడకు తెలీక అడిగింది. నువ్వు పోసినంత చిక్కగా ఈ సిటీలో ఎవరూ పోయరు అంటూ నేను పొగిడేస్తే కాస్త దిగొచ్చి మళ్ళీ పాలు పోయడం మొదలెట్టాడు'' అంది రమణి.

''ఇట్స్ టూమచ్'' అన్నాను కోపంగా.

''టూమచ్చో త్రీ మచ్చో. పరిస్థితి అది. కోరి కష్టాలు కొనితెచ్చుకోకు'' అంటూ రమణి నన్ను హెచ్చరించి ఇంట్లోకి వెళ్ళింది. నేను పాలగిన్నెతో లోపలికి నడిచాను.

''పొద్దున్నే ఎవరితో తీవ్రస్థాయిలో శిఖరాగ్ర చర్చలు జరుపుతున్నావు'' అన్నారు శ్రీవారు బద్ధకంగా ఒళ్ళు విరుచుకుంటూ.

విరంజీవి సోయగాలను పూసగుచ్చినట్లు చెప్పుకొచ్చాను.

''సర్దుకు పోవాలోయ్. అన్నీ మీ వూళ్ళో జరిగినట్లు ఇక్కడా జరుగుతాయా?'' అన్నారు.

''సర్దుకుపోక చేస్తోందేమిటి. ఆ విరంజీవి దగ్గరే పాలు పోయించుకుంటున్నాంగదా!'' అన్నాను.

నేను పాలవాడిక విషయంలో విరంజీవితో రాజీపడ్డాను.

ఇక పనిమనిషి సమస్య తేలాల్సి ఉంది.

విరంజీవి వచ్చివెళ్ళిన అరగంటకు మా ఆవర

చక్రధర్

ణలో సైకిల్ బెల్ మోగింది.

'ఎవరై ఉంటారబ్బా' అనుకుంటూ బయటకు తొంగిచూశాను. ఓ పాతికేళ్ళ పడుచు లేడీస్ సైకిల్‌కు స్టాండ్ వేసి మరోమారు సుతారంగా బెల్ మోగిస్తోంది.

అది తాను వచ్చినట్లు సంకేతమని ఆపాటికే తెలిసిపోయింది. మా ఆవరణలోని గృహిణులంతా మోరీదగ్గరకు గిన్నెలు చేరవేస్తున్నారు.

అప్పుడు ఆ యువతి కట్టుకున్న నైలాన్ చీర కుచ్చిళ్ళను పైకి లాగి బిగించి చేతికున్న వాచీని సుతారంగా తీసి పక్కన గూట్లో పెట్టి పనిలోకి దిగింది.

"దీన్ని చూస్తుంటే చిరంజీవి బాబులా ఉందే" అనుకుని గిన్నెలుతోమే విధాన్ని చోద్యంలా చూస్తూ అక్కడే నిలబడ్డాను.

గట్టిగా చేయిపెడితే చేతులే అరుగుతాయో గిన్నెలే అరుగుతాయో అన్నట్లు సుతారంగా రెండుసార్లు అలాఇలా అని పక్కన పెడుతున్నది.

"శైలూ! వచ్చేశావా! ఇవాళ రావేమో అనుకున్నా" అంటూ రమణి సంతోషంగా పలకరిస్తూ గిన్నెలు తెచ్చి పడేసింది.

"రాకూడదనే అనుకున్నా. ఏదో మీరు ఇబ్బంది పడతారని" అంది ఆ పనిమనిషి.

"గిన్నెలు ఇంట్లోకొచ్చి తీసుకోదా?" అన్నాను. ఆ తర్వాత రమణితో.

"ఇంట్లోకి రావడమే. దానికెంత టెక్కు అనీ. నా వరకూ తానే చేస్తుందిలే" అంది రమణి.

"అద్సరే—'శైలూ' అంటూ ముద్దుగా పిలుస్తున్నావు. అసలు పేరేమిటి?"

"అసలు పేరు వరహాల్లే. ఆ పేరు మొరటుగా వుందని శైలజగా మార్చుకుంది. పేరు మార్పుని పేపర్‌లో కూడా వేయించింది తెలుసా. వాళ్లింట్లో కూడా దాన్ని ముద్దుగా శైలూ అని పిలుస్తారు. ఆ పేరు పెట్టి పిలిపించుకోవడం అంటే దానికి మహా ఇష్టం. దాని ఇష్టం కాదనడమెందుకని నేనూ అలాగే పిలుస్తాను. అలా పిలవడం వల్ల నా గిన్నెలు ముందు తోమిపెడ్తుంది" అంది రమణి.

"దాని అవతారం, ఆ సైకిలూ చూస్తుంటే ఎక్కడా పనిమనిషి లక్షణాలు లేవే" అన్నాను.

"శైలూ ఏదో హాబీగా పార్ట్‌టైమ్ కింద ఈ పని చేస్తోందంతే. శైలూకి గవర్నమెంటాఫీస్‌లో వేరే ఫ్యూన్ ఉద్యోగం కూడా ఉంది."

"ఓహో! ఈ టెక్కుకి కారణం ఆ ఉద్యోగమన్నమాట"

"అన్నమాట కాదు. ఉన్న సత్యమే. మీ ఇంట్లో కుట్టుమిషనుందా! కలర్ టి.వీ ఉందా? గ్రైండరుందా?" అంటూ ప్రశ్నలు కురిపించింది రమణి హఠాత్తుగా.

"ఏం అలా అడుగుతున్నావు. కుట్టుమిషను లేదు. బ్లాక్ అండ్ వైట్ పోర్టబుల్ టి.వీ వుంది. గ్రైండరింకా కొనలేదు" అన్నాను.

"ఇవన్నీ శైలూ వాళ్ళింట్లో ఉన్నాయి. పైగా శైలూ ఇంకా పెళ్ళికాని జవ్వని. ముసలి తల్లితో కలిసుంటోంది.

ఆ సాయంత్రం శైలూని అడిగాను మా ఇంట్లో కూడా పనిచేస్తావా అని.

"ఎందుకు చేయనూ. ఉన్నదే అందుకు" అంది.

"ఒక్క గిన్నెలుతోమితే చాలు. ఇల్లూ వాకిలీ నే చిమ్ముకుంటా" అన్నా.

"నేను గిన్నెలు తోమడం తప్ప ఇంకేం పనిచేయను. టైము చాలదు"

"ఎంతిమ్మంటావు?"

"అందరూ ఇస్తున్నంతే"

"నాగాలు పెడతావా?"

"నాలుగు ఆదివారాలు రాను. మాకూ రెస్ట్ ఉండద్దూ"

"సర్లే అలాగే కానీ" అన్నాను.

"మీ ఇంట్లో గ్యాస్ ఉందా" అనడిగింది శైలూ.

"ఉంది యేం" అన్నాను.

గ్యాస్‌స్టవ్ లేని ఇళ్ళల్లో పనిచేయను. కుంపట్ల మీద, కిర్సనాయిలు స్టవుల మీద వండితే గిన్నెల మసి వదిలించడం నావల్ల కాదు"

"ఏ కాసమస్య లేదులే. ఇదిగో చూడు రోజూ అన్నం పెట్టమంటే కుదర్దు. మిగిలినపుడు నువ్వు అడక్కుండానే పెడతా"

"అన్నం మిగిలినా నాకు వద్దు. నే తీసుకుపోను" అంది శైలూ కరాఖండిగా.

"ఎంత పొగరు. అవున్లే ప్రభుత్వ ఉద్యోగిని కదా" అనుకున్నా మనసులో.

మా ఇంట్లో పనిమొదలు పెట్టే రోజే శైలు చెప్పింది. బజార్లో ఫలానా కంపెనీవారి లిక్విడ్ క్లీనర్ తెమ్మని. వాళ్ళ ఇంట్లోకూడా అదే వాడుతోందట.

"నువ్వు ఆజ్ఞవేశాక కొనక చస్తామా" అనుకుంటూ ఆపూటే బజారుకెళ్ళి క్లీనర్‌ను తెచ్చి పడేశా.

ఆలోచిస్తుంటే రమణిలాంటి వాళ్ళవల్లే ఇలా పాలమనుషులు, పనిమనుషులు నెత్తినెక్కి కూర్చుంటున్నారేమో అన్పించింది ఎంత దూరంలో ఉంచాల్సిన వాళ్ళని అంత దూరంలో వుంచనందు వల్లే వాళ్ళు ఏకుమేకవుతున్నారేమోనని అన్పించింది. ఆ సాయంత్రం రమణే ఈ విషయాన్ని స్వయంగా నిరూపించింది.

ఆ సాయంత్రం పనికి వచ్చిన శైలుతో రమణి ఒకటే కబుర్లు.

ఆ పూట శైలూ ద్రౌపది చీర కట్టుకొచ్చిందట. ఆ డిజైన్ అద్భుతంగా ఉందని రమణి పొగిడేస్తోంది. ఎక్కడ కొన్నావు? ఎంతకు కొన్నావు? అని ఆరాలుతీస్తోంది.

"రేపు సాయంత్రం ఓసారి వస్తే ఇద్దరం కలిసి షాపింగ్‌కు వెళ్దాం శైలూ!" అని రమణి ప్రాధేయపూర్వకంగా అడుగుతోంది.


నాకు చిర్రెత్తుకొచ్చింది.

"శైలు లేకుండా నువ్వెళ్ళి కొనుక్కోలేవా?" అన్నాను కోపాన్ని నొక్కిపెడుతూ.

నీకు తెలీదులే ఉండక్కా! శైలు సెలక్షన్ సుపర్బ్. నా చీరెలన్నీ శైలూయే సెలక్ట్ చేసిపెడుతుంది" అని రమణి అంటుంటే శైలు మిడిసిపాటుగా చూసింది.

నాకు ఒక్కక్షణం అక్కడ ఉండబుద్ధి పుట్టక ఇంట్లోకి వచ్చేశాను. పాలమనిషి, పనిమనిషితో మధ్యతరగతి గృహిణిగా నేను ఎడ్జెస్ట్ అయిరోజులు దొర్లించేస్తుండగా ఓరోజు అనుకోకుండా చిరంజీవి రాలేదు.

వీధి వాకిట్లో క్యూలు కట్టే గృహిణులంతా



చకోర పక్షుల్లా పడిగాపులు పడ్డారు. చిరంజీవి స్కూటర్ శబ్దం కోసం చెవులు చాటలు చేసుకున్నారు.

''స్కూటరేమైనా చెడిపోయిందేమో'' అని ఒకరంటే,

చిరంజీవికి స్కూటర్ చెడిపోయే సమస్యే లేదని మరొకరు.

చిరంజీవికేదైనా యాక్సిడెంట్ అయిందేమో అని ఒకరు అనుమాన పడగా, అవేం అశుభం మాటలు అని మరొకరి మందలింపులు.

ఆ ఇంట్లోని అమ్మలక్కలంతా ఆరోజు శైలు సైకిల్ బెల్ మోగగానే చుట్టుముట్టారు.

''చిరంజీవి ఏమయ్యాడు?''

''ఏమో నాకేం తెలుసు?'' శైలు జవాబు.

''నీకు కాక ఎవరికి తెలుస్తుంది. చెప్పవా? అని ప్రాధేయపడ్డారు.

శైలు మాత్రం చిరంజీవి గురించి రవ్వంతయినా సమాచారం అందివ్వలేదు.

ఆ క్షణమే రమణిని పక్కకిపిల్చి ఆతృత పట్టలేక అడిగాను.

''చిరంజీవి గురించి శైలు నడుగుతావేం. దానికెలా తెలుస్తుందీ'' అని

''శైలుకి కాక మరెవరికి తెలుస్తుందీ దానికీ తెలిసీ చెప్పడంలా— వాళ్లిద్దరూ గాఢంగా ప్రేమించుకుంటున్నారు. ఇన్నాళ్ళూ నువ్వు వారి ప్రేమయాగాన్ని గ్రహించలేక పోవడం ఆశ్చర్యంగా ఉంది'' అన్నది రమణి.

చిరంజీవి ఆరోజే కాదు. ఆ మర్నాడూ రాలేదు.

నాలుగయిదు రోజులపాటూ ఆ ఆవరణంతా అదే టాపిక్ అయిపోయింది.

చిరంజీవి రాకపోయినా పాలఅవసరం తప్పదు కనుక మొదట్లోనిల్చి వుండే పాలతో ఎడ్జెస్ట్ అయి ఆ నెలమంచీ కార్డులు కొన్నాం.

ఫస్ట్‌నాడయినా చిరంజీవి రాకపోతాడా? డబ్బులు వసూలుచేసుకు వెళ్ళకపోతాడా అని రమణి ఎదురుచూసింది. రమణి ఆశలు ఫలించలేదు.

శైలజే ఫస్ట్‌నాడు ఓచీటి పట్టుకొచ్చి—

''చిరంజీవి ఈ డబ్బులు వసూలు చేసుకు రమ్మన్నాడు'' అంది. చిరంజీవి రాకపోవడానికి గల కారణాలపై ప్రశ్నల వర్షం కురిపించి శైలూని ఉక్కిరిబిక్కిరి చేశారు.

''అవేమీ నన్నడక్కండి. ఈ డబ్బులు తెమ్మన్నాడు అంతే''— శైలూ కూడా ఇంట్లో పనిచేసే మనిషే గాక ప్రభుత్వ ఉద్యోగిని కూడా అయినందున అందరికీ నమ్మకం కుదిరి చిరంజీవి పాలడబ్బుల్ని శైలూ కిచ్చేశాం. దాంతోపాటే ఫస్ట్లోపనిగా తన జీతాలూ చేసుకెళ్ళింది శైలు.

ఆ వెళ్ళిన శైలు మళ్ళీరాలేదు. సైకిల్ బెల్లు మరి మోగలేదు. ఓరోజు రమణి హడావుడిగా మా ఇంట్లోకి దూసుకొచ్చి.

''ఈ వార్త విన్నావా? చిరంజీవి శైలూ లేచిపోయార్ట''అంది.

''పోతే పోయార్లే. ప్రేమికులంటివిగా'' అన్నాను.

''అది కాదక్కా. ఇంత హఠాత్తుగా ఎందుకు లేచిపోయారు? ఎక్కడికి లేచిపోయారు? ఇవేం నీకు తెలుసుకోవాలని లేదా'' అన్నది తన ఉత్సాహాన్ని నీరుగారుస్తున్నందుకు తెగబాధ పడిపోతూ.

''సరే చెప్పు! వద్దన్నా చెప్పకుండా ఉండవు''

''ఎక్కడికి లేచిపోయారో నాల్రోజుల్లో తెలుస్తుందిలేగాని వాళ్ళు లేచిపోవడానికి ప్రధాన సూత్రధారి ఒకరున్నారు. ఎవరో తెలుసా?''

''ఉహూ! తెలీదు''

''పోనీ ఊహించు'' రమణి ఆనందపడి పోతోంది.

''ఏమో! ఎవరైతే మనకేం'' అన్నాను.

''అలా ఉసూరంటావేం. ఇంత హాట్ హాట్ న్యూస్ పట్టుకొస్తే కాస్త కాఫీ అన్నా ఇవ్వకుండా''

''కాఫీకేం భాగ్యం. ఇప్పుడే ఇస్తా'' అంటూ గిన్నెలోకి డికార్షన్ వంపాను. రమణి చెప్పడం సాగించింది—

''మన మహంకాళిలేదూ! అదే ఇంటావిడ. ఓరోజు సాయంత్రమే 'గుర్రం' ఎక్కేసిందట. పాలు పోయడానికి చిరంజీవి వస్తే లోపల కూచోబెట్టిందట. చిరంజీవిని మాటల్లోకి దించిందట. శైలూని వదిలిపెట్టెయ్యమందట. అంతటితో వూరుకోక తన మనసులో మాట బయట పెట్టిందట. ఇంటావిడ అలా విజృంభించేసరికి అంతటి హీరో చిరంజీవి ఖంగుతిన్నాట్ట. ఇక వేరు దారిలేదనే నిర్ణయానికి వచ్చేసి బతికుంటే బజ్జీలమ్ముకునైనా బతకొచ్చని ఈ నిర్ణయానికొచ్చేశాట్ట'' అని పూసగుచ్చినట్లు రమణి ఉత్సాహంగా చెప్పింది.

ఇంకా మా ఆవరణలో కొత్త పనిమనిషి ఎవరూ కాలు పెట్టలేదు. ఎవరి గిన్నెలు వాళ్ళే తోముకుంటున్నారు.

ఓరోజు ఆదివారం శ్రీవారితో కలిసి ఫస్ట్ షోకి వెళ్ళాను. ఇంటర్వెల్‌లో ఆయన సిగరెట్ కంటూ బయటకు వెళ్ళారు. వస్తూ సమోసాల పొట్లం నాచేతిలో కుక్కారు. పొట్లం విప్పి ఓ సమోసా తీసి నోట్లో పెట్టుకున్నాను.

''చిరంజీవి కనపడ్డాడోయ్'' అన్నారు చెవిలో రహస్యం చెప్తున్నట్లు.

''అహా!' అన్నాను నిరాసక్తంగా.

''వాళ్ళావిడకు ఓ పొట్లం కొంటూ వద్దన్నా వినకుండా ఈ సమోసాలు నాచేతిలో పెట్టాడు'' అన్నారాయన.

నాకు పొలమారింది. వాంతి అవుతున్నట్లు అన్పించింది. ఆయనకు చెప్పకుండానే సమోసాల పొట్లం నేల జారవిడిచాను.

సినిమా అయి బయటకొస్తుంటే—

వద్దనుకున్నా చిరంజీవి, శైలు కన్పిస్తారేమోనని నా కళ్ళు వెతికాయి.

రిక్షాలో కూచుంటూ ఆయన అన్నారు.

''ఏమిటోయ్! ఆ సమోసాలు అంత బావున్నాయా? నాకు ఒకటన్నా ఆఫర్ చేయలేదూ'' అని

''అవి నూనె ఓడుతున్నాయి. ఒకటి తినగానే తలతిరిగింది. పొట్లం పారేశాను. మీ ఆరోగ్యం కూడా ఎందుకు పాడు చేయడం అని''

సమోసాలపైనా విరక్తికి కారణం శ్రీవారికి అర్థం అయి వుండవచ్చు. అయివుండక పోనూవచ్చు.

''పక్కనుంచి చిరంజీవి, శైలూల స్కూటర్ రయ్యిన దూసుకు వెళ్ళింది.

కన్పిస్తున్నంతమేరా నా కళ్ళు వాళ్ళనే ఆసక్తిగా వెంటాడాయి.

